సాక్షి
పశ్చిమగోదావరి
సోమవారం । 18 । డిసెంబర్ । 2023



షష్ఠి.. చూసొద్దాం రండి

అత్తిలి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. నెలషష్ఠికి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై తమ మొక్కులు తీర్చుకుంటారు. 8లో ▸



శాంతి థాం కిటకిట

పెనుగొండ ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. శాంతిథాంలో ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులు తెల్లవారుజాము నుంచి పూజలు నిర్వహించారు. 8లో ▸



అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక

తణుకులో ఆదివారం నిర్వహించిన అండర్ 16, 18, 20తో పాటు స్త్రీ, పురుషుల విభాగాల అథ్లెటిక్స్ పోటీల్లో మొత్తం 24 మంది విజేతలుగా నిలిచారు. 8లో ▸

న్యూస్‌రీల్

ఆటపాక అందాలు అద్భుతం

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కృష్ణమోహన్



పక్షుల కేంద్రంలో అందాలను తిలకిస్తున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కృష్ణమోహన్

కైకలూరు: కొల్లేరు పక్షుల కేరింతలు ఎంతో అద్భుతంగా ఉన్నాయని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.కృష్ణమోహన్ కితాబిచ్చారు. కుటుంబ సమేతంగా ఆటపాక పక్షుల కేంద్రాన్ని ఆదివారం ఆయన సందర్శించారు. బోటు షికారు చేస్తూ పెలికాన్, పెయింటెడ్ స్టార్క్ పక్షులను దగ్గర నుంచి తిలకించారు. అనంతరం సమీపంలోని పక్షుల నమూనా మ్యూజియం సందర్శించారు. అటవీ శాఖ డిప్యూటీ రేంజర్ జయప్రకాష్ కొల్లేరు పక్షుల విశేషాలు, నైసర్గిక స్వరూపం గురించి వివరించారు. ఈ సందర్భంగా జస్టిస్ కృష్ణమోహన్ విలేకరులతో మాట్లాడుతూ ఆటపాకలో విదేశీ, స్వదేశీ పక్షులను తిలకించడం ఎంతో ఆహ్లాదంగా ఉందన్నారు. పక్షుల సంరక్షణకు తీసుకుంటున్న చర్యలను అభినందించారు. కార్యక్రమంలో ఏలూరు జిల్లా జడ్జి సీహెచ్.పురుషోత్తం, కైకలూరు సీనియర్ సివిల్ జడ్జి వీవీఎస్‌వీ లక్ష్మి, జూనియర్ సివిల్ జడ్జి గాయత్రీ, కైకలూరు సీఐ ఆకుల రఘు, ఎస్ఐ ప్రతాప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా తెలుగు సాహిత్య, కళా ఉత్సవాలు



సాహిత్య, సాంస్కృతిక కళా ఉత్సవాల పాట బ్రోచర్ విడుదల చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): శ్రీ శ్రీ కళా వేదిక ఆధ్వర్యంలో తాడేపల్లిగూడెం బుద్దాల కన్వెన్షన్ హాల్‌లో ఆదివారం ప్రపంచ తెలుగు సాహిత్య కళా ఉత్సవాలు రెండో రోజు అట్టహాసంగా నిర్వహించారు. కవులు, రచయితలు, ఉపాధ్యాయులు, సాహితీవేత్తలు, ప్రముఖులు హాజరై 30 గంటల పాటు కళా ప్రదర్శనలు, కవి సమ్మేళనాలు, రంగస్థల ప్రదర్శనలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ ప్రదర్శనల్ని భారత్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు, మార్వెల్ బుక్ ఆఫ్ రికార్డు, ఇంటర్నేషనల్ కల్చర్ ఆఫ్ బుక్ ఆఫ్ రికార్డు, తెలుగు నేషనల్ బుక్ ఆఫ్ రికార్డుల్లో నమోదు చేశారు. శ్రీ శ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ కత్తిమండ ప్రతాప్ సారథ్యంలో జాతీయ సమన్వయకర్త కొల్లి రమావతి ఈ కార్యక్రమాల్ని పర్యవేక్షించారు. ముఖ్య అతిథిగా ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాహిత్య చరిత్రలో ఇంత మంది కవులు, కళాకారులను ఒక వేదికపై తీసుకువచ్చిన ఘనత శ్రీ శ్రీ కళావేదికకు దక్కిందన్నారు. ప్రెస్ అకాడమీ కార్యదర్శి తిలక్, కోనా శ్రీనివాసరావు, తదితరులు హాజరయ్యారు.

గ్రూప్ 1, 2 అభ్యర్థులకు ఉచిత శిక్షణ

భీమవరం: ఏపీపీఎస్సీ గ్రూప్ 1, 2 ప్రిలిమినరీ పరీక్షలకు బీసీ స్టడీ సర్కిల్ ద్వారా ఉచిత శిక్షణ అందించనున్నట్లు బీసీ సంక్షేమ సాధికారిత అధికారి జీవీఆర్‌కే ఎస్ఎస్ గణపతిరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన గ్రూప్ 2 అభ్యర్థులు బీసీ స్టడీ సర్కిల్ డైరక్టర్ కార్యాలయం శనివారపుపేటలో ఈనెల 22లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 27 నుంచి 100 మంది విద్యార్థులకు 45 రోజుల శిక్షణతోపాటు స్టైఫండ్, స్టడీ మెటీరియల్ అందజేస్తారన్నారు. వివరాలకు 99123 94799 నెంబరులో సంప్రదించాలని కోరారు. గ్రూప్ 1 అభ్యర్థులు 27లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. బయోడేటాతోపాటు, ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ మార్కుల జాబితాలు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్, బ్యాంక్ పాసుబుక్, ఫోటోలు, స్టాంప్‌లు అంటించిన కవరుతో జతచేసి డైరక్టర్, బీసీ స్టడీ సర్కిల్ ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల వై జంక్షన్ రాజమండ్రి కార్యాలయానికి 30లోపు అందచేయాలన్నారు. వివరాలకు సెల్ 91828 97970 నెంబరులో సంప్రదించాలన్నారు.

డీసీఆర్‌బీ ఏఎస్సై రమేష్‌బాబుకు అవార్డు

ఏలూరు టౌన్: ఏలూరు జిల్లా డీసీఆర్‌బీ ఏఎస్ఐగా పనిచేస్తోన్న పి.రమేష్‌బాబుకు ప్రతిష్టాత్మక డీజీపీ డిస్క్ అవార్డు దక్కింది. మంగళగిరిలోని రాష్ట్ర పోలీస్ ప్రధాన కార్యాలయంలో డీజీపీ కేవీ రాజేంద్రనాథ్‌రెడ్డి చేతులమీదుగా శనివారం ఆయన అవార్డును అందుకున్నారు. ఏఎస్ఐ పీ.రమేష్‌బాబు 1992లో పోలీస్ కానిస్టేబుల్‌గా పూర్వ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో బాధ్యతలను స్వీకరించారు. 2013లో హెడ్ కానిస్టేబుల్‌గా పదోన్నతి పొందారు.

సాధికార ప్రభంజనం

సామాజిక సాధికార బస్సు యాత్ర జరిగిన వేళ.. తూర్పు గోదావరి జిల్లా గోపాలపురం నియోజకవర్గంలోని మండల కేంద్రమైన దేవరపల్లి జనసంద్రమే అయ్యింది. సాధికార దరహాసంతో వైఎస్సార్ సీపీ జెండా రెపరెపలాడింది..

- దేవరపల్లిలో సామాజిక సాధికార బస్సు యాత్రకు అపూర్వ స్పందన
- వేలాదిగా తరలి వచ్చిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల ప్రజలు
- బైక్ ర్యాలీకి అడుగడుగునా ఘన స్వాగతం





సభలో ప్రసంగిస్తున్న మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు. వేదికపై గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, మంత్రులు, ఎమ్మెల్యేలు ; దేవరపల్లిలో సభకు తరలివచ్చిన అశేష జనంలో ఒక భాగం

సాక్షి, రాజమహేంద్రవరం/దేవరపల్లి/నిడదవోలు రూరల్/చాగల్లు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తమకు చేసిన మంచిని గుర్తు చేసుకుంటూ అశేష సంఖ్యలో దేవరపల్లికి తరలివచ్చిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల ప్రజలతో ఇక్కడి మూడు రోడ్ల జంక్షన్ కిక్కిరిసిపోయింది. దేశ చరిత్రలో ఎన్నడూ లేని సంక్షేమం తీసుకొచ్చిన సీఎం వైఎస్ జగన్‌కు ప్రజలు నిండు మనసుతో సలాం కొట్టారు. 2024లో ఆయనే మళ్లీ సీఎం కావాలని ఆకాంక్షించారు. గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అధ్యక్షతన దేవరపల్లిలో ఆదివారం నిర్వహించిన ఈ సామాజిక సాధికార బస్సు యాత్ర, బహిరంగ సభకు గోపాలపురం, దేవరపల్లి, నల్లజర్ల, ద్వారకా తిరుమల మండలాల నుంచి సుమారు 30 వేల మంది తరలివచ్చారు.

భారీ బైక్ ర్యాలీ

తొలుత మంత్రులు, ఎమ్మెల్యేలతో పార్టీ కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. మూడు వేలకు పైగా ద్విచక్ర వాహనాలతో ఈ ర్యాలీ సాగింది. బస్సుపై ర్యాలీగా సాగుతున్న మంత్రులు కారుమూరి వెంకట నాగేశ్వరరావు, చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, ఎమ్మెల్యే తలారి వెంకట్రావు తదితరులు ప్రజలకు అభివాదం చేస్తూ పార్టీ శ్రేణులను ఉత్సాహపరిచారు. అడుగడుగునా పూలవాన కురిపిస్తూ ఈ ర్యాలీకి ప్రజలు బ్రహ్మరథం పట్టారు. యర్నగూడెంలో విలేకర్ల సమావేశం అనంతరం మంత్రులు, ప్రజాప్రతినిధులు బస్సు యాత్రగా కృష్ణంపాలెం చేరుకున్నారు. అక్కడ ప్రారంభమైన ర్యాలీ దుమంతునిగూడెం, రామన్నపాలెం, బస్టాండ్ సెంటర్ మీదుగా దేవరపల్లిలోని మూడు రోడ్ల జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన సభాస్థలి వరకూ 6 కిలోమీటర్ల మేర ఈ ర్యాలీ సాగింది. ర్యాలీ ఆద్యంతం జై జగన్ నినాదాలు హోరెత్తాయి. అనంతరం సభా వేదిక వద్ద ఉన్న దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, జ్యోతిరావు పూలే, జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు మంత్రులు, ఎమ్మెల్యే, పార్టీ శ్రేణులు పూలమాలలు వేసి, నివాళులర్పించారు.

'జగన్.. వన్స్‌మోర్'

ప్రారంభం నుంచి ముగిసే వరకూ 'జై జగన్.. మా నమ్మకం నువ్వే జగనన్నా.. 2024.. జగన్ వన్స్‌మోర్' నినాదాలు సభలో హోరెత్తాయి. అధిక సంఖ్యలో తరలివచ్చిన మహిళలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తమకు చేస్తున్న మేలును గుర్తు చేసుకుని.. మళ్లీ ఆయనే అధికార పగ్గాలు చేపట్టాలని ఆకాంక్షించారు. మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యే ప్రసంగాలకు విశేష స్పందన లభించింది. రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ విధానాన్ని ముఖ్యమంత్రి అనుసరిస్తున్నట్లు మంత్రి వేణు చెప్పగానే 'జై జగన్' అంటూ ప్రజలు పెద్ద పెట్టున నినాదాలు చేశారు. జబ్బులను జల్లెడ వేసి పట్టి మరీ ఇంటికే మందులు పంపిస్తున్నారని, జగనన్న అమ్మ ఒడి పథకం ద్వారా పేద పిల్లల ఉన్నత చదువులకు బాటలు వేస్తున్నారని మంత్రి వేణు వివరించారు. జగన్ పాలనలోనే తమకు, తమ బిడ్డలకు భవిష్యత్తు లభిస్తుందని పలువురు అభిప్రాయపడ్డారు. 'అన్ని వర్గాలకూ మంచి చేస్తున్న జగన్‌ను వచ్చే ఎన్నికల్లో ఓడిపోనిస్తామా?' అని మంత్రి కారుమూరి ప్రశ్నించగా.. 'లేదు లేదు' అంటూ ప్రజలు ముక్తకంఠంతో నినదించారు. టీడీపీ నేతల అవినీతిని ప్రస్తావిస్తుంటే వచ్చే ఎన్నికల్లో చంద్రబాబుకు పుట్టగతులు లేకుండా చేస్తామని విస్పష్టంగా చెప్పారు. 'ఎస్సీలుగా ఎవరైనా పుట్టాలనుకుంటారా? బీసీల తోక కత్తిరిస్తాం' అంటూ గతంలో చంద్రబాబు చేసిన వ్యాఖ్యలను ఎంపీ నందిగం సురేష్ గుర్తు చేయగా.. వచ్చే ఎన్నికల్లో చంద్రబాబు తోక మరోసారి కత్తిరిస్తామని స్పష్టం చేశారు. తెలంగాణలో ఓటు వేసిన పవన్.. ఇక్కడ రాజకీయం చేస్తున్నారని చెప్పగా.. వచ్చే ఎన్నికల్లో దీటైన జవాబు ఇచ్చి తెలంగాణకు సాగనంపుతామని చెప్పారు.

చంద్రబాబు, పవన్ రాజకీయాలు దారుణం

పేద బిడ్డల చదువులకు ట్యాబులు ఇస్తుంటే వాటిపై కూడా చంద్రబాబు, దత్తపుత్రుడు పవన్ రాజకీయం చేయడం దారుణమని హోం మంత్రి తానేటి వనిత అనగా.. అవునంటూ సభికులు మద్దతు పలికారు. చంద్రబాబు ప్రజలను మరోసారి మోసం చేసేందుకు వస్తున్నారు. ఆయన గ్యారంటీని ఎవరైనా నమ్ముతారా అని ఎంపీ మార్గాని భరత్‌రామ్ అన్నారు. దేవరపల్లి పోలీస్ స్టేషన్ నుంచి బస్టాండ్ ఆవరణ వరకూ రూ.65 లక్షల రుడా నిధులతో చేపట్టిన సెంట్రల్ లైటింగ్ సిస్టంను ఎంపీ భరత్‌రామ్ ప్రారంభించారు.



బస్సుయాత్రలో మంత్రి కారుమూరి, ఎమ్మెల్యేలు తలారి, ఎలీజా

రూ.3 వేల కోట్లతో అభివృద్ధి, సంక్షేమం

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గోపాలపురం నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలకు చరిత్రలో ఎన్నడూ లేని విధంగా రూ.3 వేల కోట్లు వెచ్చించాం. ఇందులో కేవలం ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రూ.1,200 కోట్లు ఖర్చు చేశాం. అభివృద్ధి పనులకు రూ.700 కోట్లు కేటాయించాం. రూ.844 కోట్ల విలువైన 3,500 ఎకరాల అసైన్డ్ భూములను ఎస్సీ, బీసీలకు పంపిణీ చేశాం. 20 వేల మంది పేదలకు జగనన్న కాలనీల్లో ఇళ్ల పట్టాలు అందజేశాం. 12 వేల ఇళ్లు నిర్మాణ దశలో ఉన్నాయి. ఇది కాదా సంక్షేమం?

– తలారి వెంకట్రావు, ఎమ్మెల్యే, గోపాలపురం

సుబ్రహ్మణ్యేశ్వరుడిని దర్శించుకున్న కారుమూరి



శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామిని దర్శించుకుంటున్న మంత్రి కారుమూరి, ఎమ్మెల్యే వాసుబాబు

అత్తిలి: శ్రీ వల్లీదేవసేన సమేత శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణ మహోత్సవంలో పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు హాజరయ్యారు. ఆదివారం రాత్రి జరిగిన స్వామి వారి కల్యాణాన్ని తిలకించిన అనంతరం స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని మంత్రి కారుమూరి ఆకాంక్షించారు. ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి తీర్థ ప్రసాదాన్ని స్వీకరించారు.

నేడు మెగా ఆరోగ్యశ్రీ అవగాహన కార్యక్రమం

భీమవరం (ప్రకాశం చౌక్): సోమవారం ఉదయం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మెగా ఆరోగ్యశ్రీ అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ పి ప్రశాంతి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డి.మహేశ్వరరావు తెలిపారు. ఆరోగ్యశ్రీ వైద్య ఖర్చు పరిమితి రూ.25 లక్షలకు పెంచిన నేపథ్యంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. కలెక్టర్ కార్యాలయంలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని, జిల్లాలోని ప్రజాప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు.

షేక్ సాబ్జికి కన్నీటి వీడ్కోలు

- పెద్ద సంఖ్యలో తరలివచ్చిన ఉపాధ్యాయులు, యూటీఎఫ్ నేతలు
- అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు



అధికారిక లాంఛనాలతో షేక్ సాబ్జి అంత్యక్రియలు



సాబ్జి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ఏలూరు రూరల్: ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ షేక్ సాబ్జి అంత్యక్రియలు ఆదివారం ఏలూరులో అధికారిక లాంఛనాలతో జరిగాయి. ఏలూరు, పశ్చిమ, కృష్ణ తదితర జిల్లాలతో పాటు రాష్ట్రం నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయులు తరలివచ్చారు. లాల్ సలామ్, జోహార్ సాబ్జి అంటూ నినదిస్తూ అంతిమ వీడ్కోలు పలికారు.

ఇండోర్ స్టేడియంలో పలువురి నివాళి

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సాబ్జి మృతదేహాన్ని కుటుంబ సభ్యులు, యుటీఎఫ్, సీపీఐ నాయకులు ఆదివారం ఆశ్రం ఆసుపత్రి మార్చురీ నుంచి ఏలూరు తీసుకొచ్చారు. అభిమానులు, కార్యకర్తల సందర్శనార్థం ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకూ స్థానిక ఇండోర్ స్టేడియంలో ఉంచారు. ఎంపీ కోటగిరి శ్రీధర్, ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ల నాని, దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి, నగర మేయర్ షేక్ నూర్జహాన్ బేగం, డిప్యూటీ మేయర్లు నూకపెయ్యి సుధీర్ బాబు, గుడిదేశి శ్రీనివాస్‌తో పాటు జనసేన నేత రెడ్డి అప్పలనాయుడుతో పాటు పలువురు ఎమ్మెల్సీలు, యుటీఎఫ్ నాయకులు సాబ్జి మృతదేహంపై పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు.

అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు

అనంతరం యుటీఎఫ్ నాయకులు పార్థివదేహాన్ని వ్యాన్‌పై ఉంచి సత్రంపాడులో సాబ్జి ఇంటికి తరలించారు. అక్కడ కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు సంప్రదాయం ప్రకారం అంతిమ సంస్కరణలు నిర్వహించారు. అనంతరం అక్కడ నుంచి ఉపాధ్యాయులు భారీ ర్యాలీ నిర్వహించి సాబ్జి మృతదేహంపై జాతీయజెండా కప్పి దక్షిణపువీధి దొంగల మండపం వద్ద మదీన మసీదుకు తీసుకొచ్చారు. అక్కడ అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. ఎస్పీ డి.మేరీ ప్రశాంతి, జాయింట్ కలెక్టర్ బి. లావణ్య వేణి, ఆర్డీవో ఎన్ఎస్‌కె ఖాజావలి, తహసీల్దార్ బి.సోమశేఖర్‌లు సాబ్జికి నివాళులర్పించారు.

సాబ్జి సేవలు మరువలేం

ఉపాధ్యాయుల హక్కుల కోసం సాబ్జి చేసిన సేవలు వెలకట్టలేమని ఉపాధ్యాయుల సంఘం నాయకులు కొనియాడారు. ఆయన అంత్యక్రియలు అనంతరం యుటీఎఫ్ నాయకులు స్థానిక సంఘ కార్యాలయంలో సంతాప సభ నిర్వహించారు. ఇందులో ఎమ్మెల్సీలు పాకలపాటి రఘువర్మ, కె లక్ష్మణరావు, కల్పలత, ఐ.వెంకటేశ్వరరావు యుటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి కెఎస్ఆర్ ప్రసాద్, గౌరవ అధ్యక్షుడు కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ యుటీఎఫ్ ఆలోచనలు, నిర్ణయాలను సాబ్జీ ఎంతో గౌరవించి ఆచరించారని కొనియాడారు. ఉపాధ్యాయుల హక్కుల కోసం సాబ్జి చేసిన పోరాటం ప్రతి ఒక్కరిలో స్ఫూర్తి నింపిందని నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శులు లక్ష్మీరాజు, జ్యోతిబసు, అరుణకుమారి, హనుమంతురావు, ఏఎస్పీ మనోహర్‌కుమార్, సురేష్‌కుమార్‌తో పాటు ఏలూరు జిల్లా అధ్యక్షుడు ఆలీ, ప్రధాన కార్యదర్శి రవికుమార్. నంబూరి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

సాబ్జి మృతికి సంతాపం

ఏలూరు (టూటౌన్): షేక్ సాబ్జి మృతదేహం వద్ద సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉభయ గోదావరి జిల్లాల్లో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక ఉద్యమాలకు సాబ్జి మృతి తీరని లోటని అన్నారు. సాబ్జి నిత్యం శాసనమండలిలో ఉద్యోగులు, కార్మికులు, ప్రజల సమస్యలపై ప్రశ్నించేవారని గుర్తు చేశారు. సంతాపం తెలిపిన వారిలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మంతెన సీతారాం, వై.వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి ఏ.రవి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పి.కిషోర్, తెల్లం రామకృష్ణ, ఆర్.లింగరాజు తదితరులు పాల్గొన్నారు.

సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు





1500 మంది దంపతులచే సత్యనారాయణస్వామి వ్రతాలు.. ప్రత్యేక అలంకరణలో సత్యనారాయణ స్వామి

పాలకొల్లు అర్బన్: పట్టణంలోని పెనుమదం రోడ్డు ఆర్ఆర్ రైస్‌మిల్లు ఆవరణలో ఆదివారం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు కన్నుల పండువగా జరిగాయి. ఉభయ గోదావరి జిల్లాల గోవింద మాత ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అన్నవరం నుంచి శ్రీ సత్యవతి సమేత శ్రీ సత్యనారాయణస్వామి ఉత్సవ మూర్తుల విగ్రహాలతో దేవస్థానం అర్చకులు బ్రహ్మశ్రీ వడలి నరసింహమూర్తి, మంధా శ్రీరామమూర్తి, సాగభట్ల సీతారామశర్మ, తాతపూడి మణికంఠ శర్మ, ఆకొండి కృష్ణశర్మ బ్రహ్మత్వంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. పూజలో పాల్గొన్న దంపతులకు అన్నవరం దేవస్థానం స్వామివారి ప్రసాదం ఉచితంగా అందజేశారు. ఉత్సవ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు కుంపట్ల ప్రసాద్, కొర్రగింజల సుబ్బారావు, యాదంరెడ్డి సత్యం గురుస్వామి, రేపూరి సూర్యనారాయణ, బీరక ప్రసాద్ యాదంరెడ్డి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

సత్యనారాయణస్వామిని దర్శించుకున్న నేతలు

అన్నవరం నుంచి పాలకొల్లు పట్టణానికి ప్రత్యేక వాహనంలో తీసుకువచ్చిన శ్రీ సత్యవతి సమేత శ్రీ సత్యనారాయణస్వామివార్ల ఉత్సవ మూర్తులను వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) దర్శించుకున్నారు. అలాగే తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి సభ్యులు మేకా శేషుబాబు, రాష్ట్ర ఎస్సీ కమిషన్ మెంబర్ చెల్లెం ఆనందప్రకాష్, దెందులూరు పార్టీ పరిశీలకుడు యడ్ల తాతాజీ, మాజీ ఎమ్మెల్యే డా. సీహెచ్ బాబ్జి తదితరులు దర్శించుకున్నారు.

అభివృద్ధికి అంతా కలిసి రావాలి

డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ



మంత్రి కొట్టు సత్యనారాయణకు కృతజ్ఞతలు తెలుపుతున్న న్యాయవాదులు

తాడేపల్లిగూడెం: అభివృద్ధికి అంతా కలిసి రావాలని డిప్యూటీ సీఎం, దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ కోరారు. ఆదివారం ఆయన క్యాంపు కార్యాలయంలో మాట్లాడారు. అధికార పక్షమైనా, ప్రతిపక్షమైనా ఏ పక్షమైనా అభివృద్ధి చేసే వారిని ప్రోత్సహించాలని, ఆ ప్రాంత అభివృద్ధి గురించి ఆలోచించాలన్నారు. తాను అభివృద్ధి చేస్తుంటే చూసి ఓర్వలేక అభివృద్ధిని అడ్డుకోవాలని ప్రతిపక్ష నాయకులు ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. నియోజకవర్గంలో ఇలాంటి ప్రతిపక్ష నాయకులు ఉండటం దౌర్భాగ్యమన్నారు. పట్టణానికి అదనపు జిల్లా కోర్టు తీసుకురావడం వెనుక ఎంతో శ్రమ ఉందన్నారు. ఇది తాడేపల్లిగూడెం చరిత్రలో మైలురాయిగా నిలిచిపోతుందన్నారు. అభివృద్ధి చేస్తూ ముందుకు వెళ్తుంటే ప్రతిపక్షాలు అపశకునాలు పలుకుతున్నాయన్నారు. గత ప్రభుత్వంలో పట్టణానికి జిల్లా ఆసుపత్రి రావాల్సి ఉండగా, అప్పటి నాయకుల అసమర్థత కారణంగా అది తణుకు వెళ్లిపోయిందన్నారు. 2004 నుంచి 2009 వరకు గతంలో ఐదేళ్లు తాను ఎమ్మెల్యేగా ఉండగా అండర్‌గ్రౌండ్ డ్రైయినేజీ, రెండో ఫ్లై ఓవర్ వంతెన, ఉద్యాన విశ్వవిద్యాలయం, ఆంధ్ర యూనివర్సిటీ క్యాంపస్, నాలుగులైన్ల రహదారులు ఇలా ఎన్నో అభివృద్ధి పనులు చేశామన్నారు. 2019లో రెండోసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యాక నాలుగున్నరేళ్లలో ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామన్నారు. పట్టణానికి రెవెన్యూ డివిజన్ కార్యాలయం, పోలీసు సబ్ డివిజన్ కార్యాలయం, అదనపు జిల్లా కోర్టు సాధించామన్నారు. ఇరిగేషన్, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, ఆర్ అండ్ బీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయాలు కూడా ఏర్పాటు కాబోతున్నాయన్నారు. దూరదృష్టి లేని ప్రతిపక్ష నాయకులు ఇక్కడ ఉండటం దురదృష్టమన్నారు. ప్రతిపక్ష నేతల పార్టీలు అధికారంలో ఉండగా పట్టించుకోకుండా ఇప్పుడు మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. పట్టణ శివారు ప్రాంతాలు జువ్వలపాలెం, తాళ్లముదునూరుపాడు, వీకర్స్ కాలనీ, హౌసింగ్ బోర్డు కాలనీలకు ఇక ట్యాంకర్లతో నీరు సరఫరా చేయవలసిన అవసరం రాకుండా కొత్త పైపులైన్లు వేస్తున్నామన్నారు. మిలటరీ కాలనీ, గణేష్ నగర్ వంటి ప్రాంతాలకు సురక్షిత మంచినీటి సరఫరా కోసం ఏపీ నిట్‌కు ఎదురుగా వెయ్యి కిలోలీటర్ల కెపాసిటీతో కొత్త రిజర్వాయర్ నిర్మిస్తున్నామన్నారు. అదనపు జిల్లా కోర్టును తీసుకొచ్చినందుకు న్యాయవాదులు ధన్యవాదాలు తెలిపారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పడాల అప్పిరెడ్డి, సీనియర్ న్యాయవాదులు మాకా శ్రీనివాసు, బందారు మనోహర్, అద్దంకి విజయరత్నం, రామగాని సోమేశ్వరరావు, బాయిశెట్టి ప్రసాద్, మానుకొండ గోపాలరావు, యడవల్లి మణికంఠతేజలు ఉన్నారు.

సుబ్రహ్మణ్య షష్ఠి.. చూసొద్దాం రండి

- కోర్కెలు తీర్చే కల్పతరువు అత్తిలి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి
- నేడు షష్ఠి మహోత్సవం



అత్తిలిలో ఆలయ ప్రాంగణం



అత్తిలి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

అత్తిలి: రాష్ట్రంలో పేరుగాంచిన అత్తిలి వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. నాగదోషం ఉన్నవారు, సంతానం లేనివారు, వివాహం కానివారు, కుజదోషం, కాలసర్పదోషం ఉన్నవారు ఈ ఆలయాన్ని దర్శించి, భక్తిశ్రద్ధలతో స్వామివారికి పంచామృతాలతో అభిషేకించడం ద్వారా కోర్కెలు తీరతాయని భక్తుల విశ్వాసం. స్వామివారికి ప్రీతిపాత్రమైన మంగళవారం రోజున, నెలషష్ఠికి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై పంచామృతాభిషేకాలు, పూజలు చేయించుకుని తమ మొక్కులు తీర్చుకుంటారు. సంతానం లేనివారు నాగుల చీర కట్టుకొని ముడుపులు కడతారు. సంతానం కలిగిన తరువాత పిల్లల తలనీలాలు సమర్పించి మొక్కు తీర్చుకుని, పిల్లల తలపై నుంచి బూరెలను పోసే సంప్రదాయం ఇక్కడ ఉంది. చిన్నారులకు నామకరణం, అన్నప్రాసన, అక్షరాభ్యాసం వంటి శుభ కార్యక్రమాలు ఈ ఆలయంలో నిర్వహిస్తుంటారు. స్వామివారి కల్యాణ మహోత్సవాలు ఆదివారం నుంచి వచ్చే ఏడాది జనవరి మూడో తేదీ వరకు నిర్వహించనున్నారు. షష్ఠి తిరునాళ్లకు వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయ పరిసరాల్లో విద్యుత్ దీపాలతో దేవతామూర్తుల సెట్టింగ్‌లు నెలకొల్పారు. సోమవారం షష్ఠి తీర్థ మహోత్సవం సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ఉదయం కోలాట భజనలు, హైస్కూల్ గ్రౌండ్‌లో అన్నసమారాధన, రాత్రి శ్రీస్వామివారి ఊరేగింపు ఉత్సవం వైభవంగా నిర్వహించనున్నట్టు షష్ఠి కమిటీ అధ్యక్షుడు కుర్మెళ్ల ఉమా మహేశ్వరరావు తెలిపారు. ఉత్సవాల్లో పటిష్ఠమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఆలయ చరిత్ర

1910 దశకంలో అత్తిలి పంచాయతీ కార్యాలయం సమీపంలోని కోనేరు చెరువు వద్ద పెద్ద నాగులపుట్ట ఉండేది. పుట్టలో ఉండే పాము సంచారంతో ఈ ప్రాంత ప్రజలు పుట్టకు పూజలు చేసేవారు. వల్లీదేవసేన సమేతుడైన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కొలువై ఉన్న ఏకశిల విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. నాటి నుంచీ ఏటా మార్గశిర మాసంలో పంచమి రోజున స్వామి కల్యాణం, షష్ఠి తిధిన షష్ఠితీర్థం, రాత్రికి స్వామివారి ఊరేగింపు ఉత్సవం నిర్వహిస్తున్నారు.

ఏక శిల విగ్రహం

జిల్లాలో వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఏక శిల విగ్రహం ఈ ఆలయంలోనే ఉండటం విశేషం. నిత్యం సాయంత్రం సోమసూత్రం గుండా ఒక సర్పం గర్భగుడిలోకి వచ్చి, మరుసటి రోజు ఉదయం బయటకెళుతూ ఉంటుందని, ఇది స్వామివారి నిదర్శనమని ఆలయ అర్చకుడు ఐలూరి శ్రీరామం తెలిపారు. అన్నదానంలో అందె వేసిన చెయ్యిగా అత్తిలిని చెప్పుకుంటారంటే ఆ ఘనత వల్లిదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠి తిరునాళ్లవల్లే వచ్చింది. ప్రతి ఏటా జరిగే ఉత్సవాల్లో లక్షమందికి పైగా భక్తులు పాల్గొని స్వామిని దర్శిస్తారు. ఉత్సవాల సందర్భంగా జెయింట్ వీల్స్, రంగుల రాట్నాలు, పలు గృహోపకరణ వర్తక దుకాణాలు వెలశాయి.

తొళక్క వాహనంపై ఊరేగిన శ్రీవారు

ద్వారకాతిరుమలలో తిరువీధి సేవలు ప్రారంభం



ద్వారకాతిరుమల: ధనుర్మాస ఉత్సవాలను పురస్కరించుకుని శ్రీవారి తిరువీధి సేవలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా స్వామివారు ఉభయ దేవేరులు, గోదాదేవితో కలిసి తొళక్క వాహనంపై క్షేత్ర పురవీధుల్లో అట్టహాసంగా ఊరేగారు. తొలుత ఆలయంలో స్వామి, అమ్మవార్లు, గోదాదేవి ఉత్సవ మూర్తులను తొళక్క వాహనంపై ఉంచి ప్రత్యేక పుష్పాలంకారాలు చేశారు. పూజాధికాలు అనంతరం హారతులిచ్చారు. అనంతరం శ్రీవారి వాహనం మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, గజ, అశ్వ సేవలు, భక్తుల గోవింద నామస్మరణల నడుమ ఆలయ ప్రధాన రాజగోపురం మీదుగా పురవీధులకు పయనమైంది. ప్రతి ఇంటి ముంగిటా భక్తులు స్వామి, అమ్మవార్లకు నీరాజనాలు సమర్పించారు. అనంతరం ఆలయ ధనుర్మాస మండపంలో శ్రీవారు, అమ్మవార్లు, గోదాదేవికి అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

క్లుప్తంగా

గుబ్బల మంగమ్మ సేవలో భక్తులు



గుబ్బల మంగమ్మ దర్శనానికి తరలివచ్చిన భక్తులు

బుట్టాయగూడెం: బుట్టాయగూడెం మండలంలోని మారుమూల గ్రామమైన కామవరం అటవీప్రాంతంలో కొలువై ఉన్న గుబ్బల మంగమ్మ తల్లిని ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. తెల్లవారుజాము నుంచే అమ్మవారికి దూప, దీప, నైవేద్యాలతోపాటు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ప్రైవేటు బస్సులు, మినీ వ్యాన్‌లు, ఆటోలు, ద్విచక్ర వాహనాల్లో భక్తులు ఆలయానికి తరలి వచ్చారు. మర్లగూడెం అటవీప్రాంతంలో కొలువై ఉన్న పాటెమ్మ, దుర్గమ్మవార్ల ఆలయాలకు భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి ప్రత్యేక పూజలు చేశారు. మొక్కులు చెల్లించుకున్నారు.

కళకళలాడిన సాగర తీరాలు



పేరుపాలెం బీచ్‌లో సందర్శకుల సందడి

మొగల్తూరు : మొగల్తూరు మండలం పేరుపాలెం, కేపీపాలెం సాగర తీరాలు సందర్శకులతో కళకళలాడాయి. ఈ ఏడాది కార్తీక మాసంలో ఏర్పడిన మిచాంగ్ తుపాను అనంతరం వారం రోజుల పాటు బీచ్ సందర్శనపై నిషేధం విధించారు. పర్యాటకులకు గత వారం నుంచి అనుమతిచ్చారు. ఉదయం ఎనిమిది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు మాత్రమే సముద్ర స్నానాలకు అవకాశం కల్పించారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు బందోబస్త్ ఏర్పాటు చేశారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌కు 24 మంది ఎంపిక



విజేతలైన క్రీడాకారులతో అసోసియేషన్ నాయకులు

తణుకు అర్బన్: క్రీడాకారుల్లో నైపుణ్యాన్ని వెలికితీసేందుకు అసోసియేషన్ తరపున క్రీడాపోటీలు నిర్వహించడం అభినందనీయమని సిటీ ఎమర్జన్సీ హాస్పటల్ వైద్యుడు ఖాజా మొహిద్దీన్ అన్నారు. జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం తణుకు శ్రీ చిట్టూరి ఇంద్రయ్య మెమోరియల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడా ప్రాంగణంలో నిర్వహించిన క్రీడాపోటీలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అసోసియేషన్ జిల్లా కార్యదర్శి సంకు సూర్యనారాయణ, ఆర్గనైజింగ్ కార్యదర్శి కటికితల బాబూరావు మాట్లాడుతూ అండర్ 16, 18, 20తోపాటు స్త్రీ, పురుషుల విభాగాల్లో నిర్వహించిన అథ్లెటిక్స్ పోటీల్లో మొత్తం 150 మంది క్రీడాకారులు పాల్గొనగా నాలుగా విభాగాలకు సంబంధించి 24 మంది విజేతలుగా నిలిచారని, వీరు ఈనెల 24న సామర్లకోటలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్టు చెప్పారు. విజేతలకు డాక్టర్ ఖాజీ మొహిద్దీన్ సహకారంతో మెడల్స్, ప్రశంసాపత్రాలు అందజేశామన్నారు. అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు చింతకాయల సత్యనారాయణ పర్యవేక్షణలో నిర్వహించిన ఈ పోటీల్లో ఎం.శ్రీనివాస్, రాష్ట్ర వ్యాయామ ఉపాధ్యాయ సంఘ కార్యదర్శి ఆర్ రామకృష్ణ, త్రోబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు నీలం సత్యనారాయణ, వ్యాయామ ఉపాధ్యాయులు ప్రదీప్, చిరంజీవి, నాగేశ్వరరావు, సుబ్రహ్మణ్యం, జీమ్సీ, సుజాత, విజయదుర్గ, వెంకన్నబాబు, వంశీ, శ్రీకాంత్, రవి పాల్గొన్నారు.


నేత్రపర్వం.. పాల కావిడి ఉత్సవం



సుబ్రహ్మణ్యేశ్వరుడి ఆలయం వద్ద నుంచి పాల కావిళ్లతో బయల్దేరిన భక్తులు, బాలలు

ద్వారకాతిరుమల: చినవెంకన్న ఆలయానికి ఉపాలయమైన చెరువువీధిలోని శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరుని ఆలయంలో స్వామివారి కల్యాణ మహోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా సుబ్రహ్మణ్యేశ్వరుడికి పాల కావిడి ఉత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. ముందుగా ఆలయంలో అర్చకులు స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులకు విశేష పూజలు జరిపారు. అనంతరం పాల కావిళ్లలో సుగంధ ద్రవ్యాలను ఉంచి భక్తులకు అందించారు. ఆ తరువాత మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, అర్చకుల వేద మంత్రోచ్ఛరణల నడుమ పాల కావిళ్ల గ్రామోత్సవం ఘనంగా జరిగింది. ప్రతి ఇంటి ముందు భక్తులు స్వామివారి పాల కావిళ్లకు హారతులిచ్చారు. తిరిగి ఆలయానికి చేరుకున్న పాల కావిళ్లలోని సుగంధ ద్రవ్యాలతో అర్చకులు స్వామివారి మూలవిరాట్‌కు అభిషేకాలు జరిపారు. ఈ వేడుకలో పెద్దలతో పాటు చిన్నారులు, బాలలు సైతం సంప్రదాయ దుస్తుల్లో పాల కావిళ్లను మోయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పాల కావిళ్లను మోయడం ద్వారా సర్వదోషాలు తొలగుతాయని పండితులు చెబుతున్నారు. ఆలయంలో స్వామివారికి అభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన, నిత్యోపాసన వంటి కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం



శ్రీనివాసరావు మృతదేహం

ద్వారకాతిరుమల: మండలంలోని ద్వారకానగర్‌లో బెనర్జీ హాస్పిటల్ సమీపంలోని పెట్రోల్ బంకు వద్ద ఆదివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ద్వారకాతిరుమల ఎస్సై టి.సుధీర్ తెలిపిన వివరాల ప్రకారం.. భీమడోలు మండలం గుండుగొలను గ్రామానికి చెందిన నాయుడు శ్రీనివాసరావు (50), ద్వారకాతిరుమల మండలం ఎం.నాగులపల్లిలో ఉన్న తన కుమార్తె వద్దకు బైక్‌పై వెళుతున్నాడు. అదే సమయంలో రాజమండ్రి నుంచి భీమడోలు వైపుకు సర్వీసు రోడ్డులో వేగంగా వెళుతున్న ఒక కారు ఘటనా స్థలం వద్ద బైక్‌ను ఎదురుగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్ నడుపుతున్న శ్రీనివాసరావు తీవ్ర గాయాలు పాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనా స్థలాన్ని ద్వారకాతిరుమల పోలీసులు పరిశీలించారు. శ్రీనివాసరావు కుమారుడు నాయుడు నాగసాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్టు ఎస్సై తెలిపారు.

మహిళపై కత్తితో దాడి



గాయపడిన వరలక్ష్మి

ఉంగుటూరు: ఉంగుటూరు మండలం చేబ్రోలులో మహిళపై దాడిచేసిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఆదివారం ఉదయం చేబ్రోలుకు చెందిన ధనకొండ వరలక్ష్మి పొలంలో వరినాట్లు వేస్తుండగా, నారాయణపురం ఎస్టీ కాలనీకి చెందిన బోడిగట్ల భీమయ్య కత్తితో దాడి చేశాడు. దాడిలో గాయపడిన వరలక్ష్మిని 108 వాహనంలో ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. భర్త మృతి చెందడంతో వరలక్ష్మి కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తోందని స్థానికులు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

మోటార్ సైకిల్ దగ్ధం

ఆకివీడు: ఆకివీడు మండలం కోళ్లపర్రు గ్రామంలో మిద్దే మల్లేష్‌కు చెందిన మోటారు సైకిల్ దగ్ధమైంది. ఆకివీడు అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో అగ్నిమాపక అధికారి వై.నాగేశ్వరరావు ఘటనా స్థలిని పరిశీలించారు. గుర్తుతెలియని వ్యక్తులు నిప్పంటించి ఉంటారని అనుమానం వ్యక్తం చేశారు.

గౌడ సంఘం తాత్కాలిక అధ్యక్షుడు అశోక్‌గౌడ్ తొలగింపు



అడహక్ కమిటీ వివరాలు తెలియజేస్తున్న కన్వీనర్ వెంకటేశ్వరరావు

ఏలూరు (టూటౌన్): పార్టీలకు అతీతంగా రాష్ట్రంలోని గౌడ సంఘీయుల సంక్షేమం, అభివృద్ధికి కృషి చేయాల్సిన ఏపీ రాష్ట్ర గౌడ సంఘం తాత్కాలిక అధ్యక్షుడు చలుమోలు అశోక్‌గౌడ్ సంఘానికి టీడీపీ ముద్రవేసే విధంగా వ్యవహరించడం వల్లే చైర్మన్ జోగి రమేష్ ఆదేశాల మేరకు ఆయన్ని తొలగించినట్టు అడహక్ కమిటీ కన్వీనర్ చలపాటి వెంకటేశ్వరరావు తెలిపారు. స్థానిక యాదవ సంఘం జిల్లా కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన రాష్ట్ర కమిటీ అత్యవసర సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల పెదవేగి మండలంలో వీరంకి లక్ష్మీనారాయణ అనే గౌడ కులస్తుడిని కొట్టిన ఘటనలో టీడీపీకి చెందిన అగ్రవర్ణ పెత్తందారునికి వత్తాసు ఇచ్చి బాధితుడు లక్ష్మీనారాయణతోనే తనను కొట్టలేదంటూ చెప్పించడం బాధాకరమని అన్నారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు ప్రచార మాధ్యమాల్లో వైరలైనట్టు చెప్పారు. అశోక్‌గౌడ్ బాధ్యతలు స్వీకరించిన ఏడాదిన్నర కాలంలో గౌడ సంఘాన్ని టీడీపీకి తాకట్టు పెట్టే ప్రయత్నం చేయడం బాధాకరమని అన్నారు. దీనిపై ఏలూరులో ఆదివారం నిర్వహించిన రాష్ట్ర కమిటీ అత్యవసర సమావేశంలో లోతుగా చర్చించి మెజార్టీ నాయకుల అభిప్రాయాల మేరకు చైర్మన్ జోగి రమేష్ ఆదేశాల మేరకు అశోక్ గౌడ్‌ను తొలగించడం జరిగించినట్టు చలపాటి తెలిపారు.

అడహక్ కమిటీ ఎన్నిక

గౌడ సంఘం తాత్కాలిక అధ్యక్షుడు అశోక్‌గౌడ్‌ను తొలగించడంతో పాటు ఇప్పటి వరకూ ఉన్న పాత కమిటీ మొత్తాన్ని రద్దు చేసినట్టు చలపాటి వెంకటేశ్వరరావు తెలిపారు. ఆరు నెలల వ్యవధిలో నూతన రాష్ట్ర కమిటీని ఎన్నుకునేందుకు వీలుగా రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో పర్యటించేందుకు అడహక్ కమిటీని ఏర్పాటు చేసినట్టు చెప్పారు. గౌడ సంఘం అడహక్ కమిటీ కన్వీనర్‌గా చలపాటి వెంకటేశ్వరరావు, కోకన్వీనర్లుగా మట్టా వీరబాబు, తాతా కృష్ణారావు, మట్టా లక్ష్మి, అనుమోలు ఏడుకొండలు, దాసరి ప్రసాద్, మట్టా రమా శంకర్, మాదు గంగాధరరావు, యార్లగడ్డ గోవర్ధనరావు, పరసా ఏడుకొండలు, బుడ్డిగ రాము, వీరంకి రామచంద్రరావు, పరసా వీర్రాజు, లీగల్ అడ్వైజర్లుగా పామర్తి సత్యనారాయణ, బడుగు మురళీకృష్ణలను నియమించారు.

విశ్రాంత పీడీకి బంగారు పతకాలు



నరసింహరాజును అభినందిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం : 76 ఏళ్ల వయసులో అథ్లెట్స్ పోటీల్లో పాల్గొని రాష్ట్ర స్థాయిలో నాలుగు బంగారు, ఒక వెండి పతకం సాధించిన విశ్రాంత ఫిజికల్ డైరెక్టర్ ముదునూరి నరసింహరాజును స్థానిక అల్లూరి సీతారామరాజు మున్సిపల్ పార్క్‌లో ఆదివారం ఆరోగ్య అభిలాషులు ఘనంగా సత్కరించారు. నరసింహరాజు క్రీడాకారులకు, వ్యాయామ విద్యకు చేస్తున్న సేవలను వారు కొనియాడారు. తిరుపతిలో ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి మాస్టర్ అథ్లెట్స్ అసోసియేషన్ రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో 75, 80 సంవత్సరాల వయసు మధ్య గ్రూపులో నరసింహరాజు పాల్గొన్నారని తెలిపారు. 100 మీటర్లు, 200 మీటర్లు, 400 మీటర్లు, 4 ఇంటూ 100 రిలే పరుగు పందాల్లో ప్రథమ స్థానంలో నిలిచి నాలుగు బంగారు పతకాలు సాధించారని చెప్పారు. 4 ఇంటూ 400 రిలే పరుగులో ద్వితీయ స్థానంలో నిలిచి వెండి పతకం సాధించారని తెలిపారు. ఈ సందర్భంగా నరసింహరాజు మాట్లాడుతూ క్రమశిక్షణ, ఆరోగ్యం పట్ల అవగాహన అవసరమన్నారు. వ్యాయామం, యోగ వల్ల ఆరోగ్యం పెంపొందుతుందని తెలిపారు. భావితరాలను క్రమశిక్షణతో తల్లిదండ్రులు తీర్చిదిద్దాలని అన్నారు. కార్యక్రమంలో బోడా సత్యనారాయణ, డాక్టర్ సత్తి తాతారెడ్డి, వాసా సత్యనారాయణ, గుబ్బల వెంకట సత్యప్రసాద్, కొప్పిశెట్టి వెంకట సూరిబాబు, రామకృష్ణ, సప్పెళ్ల సత్తిరెడ్డి, చింతా రామిరెడ్డి, లక్ష్మీనారాయణ, సలాది ప్రసాద్, ఆర్టీసీ ప్రసాద్, జ్ఞానేశ్వరరావు, వి.వీర్రాజు, అట్లూరి రామరాజు, మనుకొండ శాండీ, సిరి, గంగ, శైలజ, కల్యాణి, జీవీవీ సత్యనారాయణ, మణి తదితరులు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ జిల్లా కార్యవర్గం ఎన్నిక



ఏపీటీఎఫ్ జిల్లా కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న మంజుల

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) ఏలూరు జిల్లా నూతన కార్యవర్గం ఎన్నికైంది. స్థానిక ఏపీ ఎన్జీవో హోంలో ఏపీటీఎఫ్ ఏలూరు జిల్లా అధ్యక్షుడు బి.రెడ్డిదొర అధ్యక్షతన ఆదివారం జిల్లా కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నూతన అధ్యక్షుడిగా టి.రామారావు, ప్రధాన కార్యదర్శిగా బి.రెడ్డిదొర, ఉపాధ్యక్షులుగా బి.శ్యాంసుందర్, ఎస్‌జేపీ నారాయణ, ఎస్ దొరబాబు, కేఎస్ రమాదేవి, కార్యదర్శులుగా యూవీ నరసింహరాజు, జె.సోమేశ్వరశాస్త్రి, వి.గణేష్, పీవీఆర్ రాజ్యలక్ష్మి, డీకేఎస్ఎస్ ప్రకాశరావు, రాష్ట్ర కౌన్సిలర్లుగా కె.కుటుంబరావు, ఎస్ భాస్కర్ వర్మ, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా టి.ప్రకాష్, కో కన్వీనర్లుగా పి.జగదీశ్వరరావు, టి.నారాయణదాసు ఎన్నికయ్యారు. వీరితో ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర అధ్యక్షులు చెన్నుపాటి మంజుల ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా మంజుల మాట్లాడుతూ జీఓ 117ని రద్దు చేయాలని కోరారు. రాష్ట్ర కార్యదర్శి బీఏ సాల్మన్ రాజు, రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి పి.పాండురంగ వరప్రసాద్‌లు మాట్లాడారు. పీఎఫ్, ఏపీజీఎల్ఐ రుణాలను మంజూరు చేయాలని, డీఏ బకాయిలను విడుదల చేయాలని, మున్సిపల్ ఉపాధ్యాయులకు పదోన్నతులు, బదిలీలు చేపట్టాలని వారు కోరారు.

సెల్‌ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా గాలింపు



అదృశ్యమైన ఇంటర్మీడియేట్ విద్యార్థులు

తణుకు: సెల్‌ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా అదృశ్యమైన విద్యార్థుల ఆచూకీ కోసం గాలిస్తున్నట్టు తణుకు పట్టణ ఎస్సై కె.శ్రీనివాస్ తెలిపారు. తణుకు పట్టణంలోని ఒక ప్రైవేటు కళాశాలలో ఇంటర్మీడియేట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఇద్దరు విద్యార్థులు ఈనెల నెల 14 నుంచి కనిపించడం లేదు. దీనిపై కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు. పట్టణంలోని కొండాలమ్మ పుంత ప్రాంతానికి చెందిన పెచ్చెట్టి కల్యాణ్, ఇరగవరం మండలం తూర్పువిప్పర్రు గ్రామానికి చెందిన కొండేటి ప్రవీణ్‌లు ఈనెల 14న కళాశాలకు వెళుతున్నామని చెప్పి తిరిగి ఇంటికి రాలేదు. అయితే గుడివాడ పరిసర ప్రాంతాల్లో విద్యార్థుల సెల్‌ఫోన్ సిగ్నల్స్ గుర్తించి అక్కడి పోలీసులతోపాటు బస్టాండు, రైల్వేస్టేషన్లలో గాలింపు ముమ్మరం చేసినట్టు ఎస్సై వివరించారు. వీరి ఆచూకీ తెలిస్తే తణుకు పట్టణ పోలీసు స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

19 నుంచి నాటిక పోటీలు

వీరవాసరం: తోలేరు సుబ్రహ్మణ్యేశ్వర కళాపరిషత్ ఆధ్వర్యంలో ఏటా నిర్వహించే జాతీయస్థాయి నాటిక పోటీలు ఈ నెల 19 నుంచి ప్రారంభమవుతాయని కళా పరిషత్ అధ్యక్షుడు చవ్వాకుల సత్యనారాయణమూర్తి ఆదివారం తెలిపారు. జాతీయ స్థాయి నాటిక పోటీలకు ఆరు నాటికలను ఎంపిక చేశామని చెప్పారు. 19వ తేదీన హర్ష క్రియేషన్స్ విజయవాడ వారి స్వర్ణ కమలాలు నాటిక, 20న చైతన్య కళాభారతి కరీంనగర్ వారి చీకటి పువ్వు వాటిక, గోరువంక శర్వాణి గిరిజన సాంస్కృతిక సేవా కేంద్రం వారి కొత్త పరిమళం నాటికలు, 21న హైదరాబాద్ సిరిమువ్వ కల్చరల్ వారి థింక్ నాటిక, కట్లపాడు ఉషోదయ కళానికేతన్ వారి విముక్తి నాటిక, 22న గుంటూరు అమృతలహరి నాన్న నేను వచ్చేస్తా నాటికలు ఎంపిక చేశామన్నారు. కళా వేదికపై సినీ నటులు, దర్శకులు ఆర్ నారాయణమూర్తి, ఎం సుబ్బరాయ శర్మ, రంగస్థలం నటుడు గుమ్మడి గోపాలకృష్ణలకు గౌరవ సత్కారం ఉంటున్నారు. భక్తులంతా పాల్గొని ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

వాసవీ శాంతి థాంలో భక్తుల కిటకిట



పెనుగొండ వాసవీ శాంతి థాంలో అర్చన చేస్తున్న ఇతర రాష్ట్రాల భక్తులు

పెనుగొండ: ఆర్యవైశ్యుల ఇలవేల్పు వాసవీ కన్యకపరమేశ్వరి జన్మస్థలమైన పెనుగొండ వాసవీ శాంతి థాం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి ప్రత్యేకంగా వచ్చిన భక్తులు తెల్లవారుజాము నుంచి అమ్మవార్లకు పూజలు చేశారు. మూలవిరాట్ వాసవీ మాతకు, అఖిల భారత శ్రీవాసవీ పెనుగొండ ట్రస్ట్ ఆధ్వర్యంలోని వాసవీ శాంతి థాంలోనూ అమ్మవార్లను దర్శించుకుని అభిషేకాలు నిర్వహించారు. దంపతుల పూజలు, కుంకుమార్చనలు నిర్వహించారు. వాసవీ థాంలో వాసవీ హోమం, గోపూజలు నిర్వహించారు. మరకత శిల వాసవీ మాతకు ప్రత్యేక అభిషేకంలు నిర్వహించారు.

చీరల వేలం

శ్రీనగరేశ్వర మహిషాసురమర్దనీ వాసవీ కన్యక పరమేశ్వరి ఆలయంలో ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ చీరల వేలం నిర్వహించారు. ఇతర రాష్ట్రాల నుంచి భక్తుల రాకతో 92 చీరల వరకూ వేలంలో దక్కించుకొన్నారు. సోమవారం సైతం వేలం కొనసాగించనున్నట్లు అధికారులు తెలిపారు.

క్లుప్తంగా

నేత్రపర్వంగా సుబ్బారాయుడి కల్యాణం



అత్తిలిలో స్వామివారి తలంబ్రాలను పట్టుకుంటున్న మహిళలు

అత్తిలి: మండలంలోని వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణం ఆదివారం రాత్రి నేత్రపర్వంగా నిర్వహించారు. అత్తిలి గ్రామానికి చెందిన కురెళ్ల సత్యనారాయణ, వరవిఘ్నేశ్వరీదేవి దంపతులచే స్వామివారి కల్యాణాన్ని జరిపారు. ఆలయ అర్చకులు ఐలూరి శ్రీరామం, కృష్ణమూర్తి ఆధ్వర్యంలో కల్యాణ తంతు శాస్త్రోక్తంగా నిర్వహించారు. శ్రీస్వామివారి తలంబ్రాలను మహిళలు తమకొంగులలో పట్టుకున్నారు. పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారి కల్యాణోత్సవానికి హాజరై తిలకించారు.

పాతూరులో వైభవంగా ధనుర్మాస పూజలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ధనుర్మాసం ప్రారంభం సందర్భంగా ఆదివారం స్థానిక పాతూరులోని లక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్ద స్వామి వారికి అగ్నిహోత్రం సుందర రామానుజచార్యులు బ్రహ్మత్వంలో ఆలయ ఈఓ హరిరామప్రసాద్ పర్యవేక్షణలో విశేష పూజలు జరిగాయి. స్వామివారికి సహస్ర నామ అష్టోత్తర పూజలు, ఆంజనేయస్వామికి విశేష పూజలు నిర్వహించారు. గట్టి నాగేంద్ర దంపతులు పూజల్లో పాల్గొన్నారు. అనంతరం ఆలయం నుంచి స్వామి వారి పల్లకి మహోత్సవం పుర వీధులలో అంగరంగ వైభవంగా సాగింది. ఆలయ చైర్మన్ కె.శ్రీనివాస్ మాట్లాడుతూ సంక్రాంతి వరకు ధనుర్మాసం పూజలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ప్రతిరోజు నిర్వహించి పల్లకి ఉత్సవంలో భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శించాలన్నారు.

దేవుని ఆధ్యాత్మిక శక్తితోనే అద్భుతాలు సాధ్యం



పాతూరులో పల్లకిసేవ చేస్తున్న దృశ్యం

పెంటపాడు: దేవుని ఆధ్యాత్మిక శక్తి ద్వారానే మానవుని జీవితంలో అద్భుతాలు సాధ్యమని రామచంద్రపురంకు చెందిన దైవసేవకులు బ్రదర్ వి. స్టీఫెన్ పేర్కొన్నారు. పెంటపాడు మండల ఉపాధ్యాయ, ఉద్యోగుల సంఘ ఐక్య క్రిస్మస్ సెలబ్రేషన్ కార్యక్రమం ఆదివారం రాత్రి స్థానిక వీణం వీరన్న ఓపెన్ ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక స్కిట్ వేసి, కీర్తనలు ఆలపించారు. పాల్గొన్న కుటుంబాలకు ప్రేమవిందు ఏర్పాటు చేశారు. డీపీవో జీవీకే మల్లికార్జునరావు, ఎంపీపీ దాసరి హైమావతి, తహసీల్దార్ జీవీ శేషగిరిరావు, ఎంపీడీవో బాలాజీ, ఎంఈవో టీవీ రామకృష్ణ తదితరులు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.


కళాకారుల నెలవారీ సేవలు అభినందనీయం



బీవీఆర్ కళాకేంద్రంలో మాట్లాడుతున్న వక్తలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): బీవీఆర్ కళా కేంద్రంలో ఆదివారం రాత్రి నెలవారీ సంగీత, నృత్య, సాహితీ, సాంస్కృతిక సమాహారం సభాధ్యక్షుడు బుద్దాల వెంకట రామారావు ఆధ్వర్యంలో నిర్వహించారు. కళాకారులచే ట్రాక్ సింగింగ్ అనంతరం సభా, సత్కార కార్యక్రమాలు జరిగాయి. తొలుత కళాకారులచే జ్యోతి ప్రజ్వలన గావించారు. వాసవి క్లబ్ ప్రెసిడెంట్ నున్న శ్రీనాగలక్ష్మి గౌరవ పురస్కారం, ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత అల్లు శ్రీనివాసరావుకు సేవా పురస్కారం, భజన కళాకారుడు యిసరపు అబ్బులుకు ఆర్థిక సత్కారం చేశారు. ఈ కార్యక్రమంలో కళాకారులు, పట్టణ ప్రజలు, అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

జాయ్ క్రిస్మస్ పోస్టర్ల ఆవిష్కరణ



జాయ్ క్రిస్మస్ వేడుకల పోస్టర్లు ఆవిష్కరిస్తున్న జాయ్‌బాబు, తదితరులు

పెంటపాడు: ఈనెల 19న గూడెం కొబ్బరితోటలో నిర్వహించబోయే జాయ్ దయాగ్నోస్టిక్ 27 వార్షిక క్రిస్మస్ వేడుకలకు సంబంధించి ఆదివారం వల్లూరుపల్లిలోని ప్రార్థనా కేంద్రంలో జాయ్ ఆధ్వర్యంలో పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రార్థనా కేంద్ర నిర్వాహకురాలు మల్లిపూడి జమాయమ్మ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఎల్ఎల్ఎం విమోచన పరిచర్య ప్రార్థనా నిర్వాహకులు జైబాబు ఈ కార్యక్రమంలో దేవుని వాక్యం బోధిస్తారన్నారు. ఈ సందర్భంగా మంగళవారం సాయంత్రం అన్న, వస్త్రదానాలు చేస్తారని తెలిపారు.

సేవకు చిరునామాలు సచివాలయాలు

- ఇంటి ముంగిటకే ప్రభుత్వ పాలన
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజానీకం



తణుకు మున్సిపల్ కార్యాలయంలో ఉన్న సచివాలయం

తణుకు అర్బన్ : గ్రామ స్వరాజ్యం. ఈ మాట పుస్తకాల్లో చదవడం, ప్రసంగాల్లో వినడం తప్ప వాస్తవిక పరిస్థితుల్లో ఎప్పుడూ చూడలేదు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చాక గ్రామ, వార్డు సచివాలయాలతో ఇంటి ముంగిటకే పాలన వచ్చింది. ప్రభుత్వం నుంచి ప్రజలకు అందుతున్న సేవల్లో అవినీతికి తావులేకుండా ఇంటి గుమ్మంలోకే పారదర్శకంగా అందుతున్న ప్రభుత్వ సేవలను ప్రజానీకం స్వాగతిస్తున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సృష్టించిన నవరత్నాల ద్వారా అందిస్తున్న సంక్షేమ పథకాలన్నీ సచివాలయ వ్యవస్థ ద్వారా ఇంటి గడపలోకే చేరుతున్నాయి. ముఖ్యంగా ప్రతి 50 ఇళ్లకు స్థానికంగానే ఉన్న ఒక వలంటీరు ద్వారా అందిస్తున్న సేవలు ప్రజలు నీరాజనాలు పలుకుతున్నారు. ఏ అవసరం ఉన్నా వలంటీరును సంప్రదించి సచివాలయం ద్వారా సేవలు పొందుతున్న వైనాన్ని ప్రజానీకం వేనోళ్ల పొగుడుతున్నారు.

గతంలో జన్మభూమి కమిటీల దోపిడీ...

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రజలకు పింఛన్ కావాలన్నా, రేషన్ కార్డు కావాలన్నా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగినా పనికాని దుస్థితి. టీడీపీ నాయకులు, కార్యకర్తలకు ప్రయోజనం చేకూర్చే విధంగా టీడీపీ ప్రభుత్వం వారిని జన్మభూమి పేరుతో ఒక కమిటీగా నియమించింది. ప్రతి వార్డుకు ఇలా ఒక కమిటీ ఉండేది. ఆ వార్డులోని ప్రజానీకం ఆ జన్మభూమి కమిటీలో ఉన్న టీడీపీ కార్యకర్తలకు ముడుపులు చెల్లించుకుని వారి సంతకాల ద్వారా మాత్రమే లబ్ధి పొందే అవకాశం ఉండేది. దీంతో ప్రజానీకం కార్యాలయాల చుట్టూ తిరగలేక, జన్మభూమి కమిటీలకు ముడుపులు చెల్లించలేక తీవ్ర ఇబ్బందులు పడేవారు. ప్రజా సంకల్పయాత్రలో ప్రజలు నేరుగా తెలపడంతో ఆ పరిస్థితిని గమనించిన ప్రస్తుత సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తాను సీఎం కాగానే సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రజల గడపలోకే సంక్షేమాన్ని అందిస్తానని ప్రజాసంకల్పయాత్రలో మాటిచ్చారు. అదే మాటను నెరవేరుస్తూ సచివాలయాలను ఏర్పాటు చేసి రాష్ట్ర వ్యాప్తంగా వార్డు, గ్రామ సెక్రటరీలు, వలంటీర్లను నియమించి అవినీతికి తావులేకుండా ఇంటి గుమ్మంలోకే లబ్ధి చేకూరుస్తున్నారు. గత టీడీపీ ప్రభుత్వానికి, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి ఉన్న తేడాను గమనిస్తున్న ప్రజానీకం మరల సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డినే గెలిపించుకుంటామని చెబుతున్నారు.

తణుకు నియోజకవర్గంలో...

తణుకు నియోజకవర్గంలో తణుకు మున్సిపాలిటీతో పాటు తణుకు, అత్తిలి, ఇరగవరం మండలాల్లో మొత్తం 82 సచివాలయాలు ఉండగా 687 మంది వార్డు, గ్రామ సెక్రటరీలు, 1050 మంది వలంటీర్లు ప్రజలకు సేవలందిస్తున్నారు.

అవినీతిరహిత పాలన అందిస్తున్న సీఎం జగన్



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి యావత్ ప్రజానీకానికి అవినీతిరహిత పాలన అందించాలనే ఉద్దేశ్యంతో ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందుతున్నాయి. రాష్ట్ర మంత్రివర్యులు కారుమూరి వెంకట నాగేశ్వరరావు ఎప్పటికప్పుడు సచివాలయ సిబ్బంది, వలంటీర్లకు సమావేశాలు నిర్వహించి అవినీతి లేకుండా సేవలు అందేలా కృషి చేస్తున్నారు.

– యిందుగపల్లి బలరామకృష్ణ, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్

అమ్మ ఒడి అందింది



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంచి పాలన అందిస్తున్నారు. ముఖ్యంగా అమ్మ ఒడి పథకం చాలా బాగుంది. వలంటీరు తీసుకున్న దరఖాస్తు ద్వారా నాకు అమ్మ ఒడి పథకం అందుతుంది. ఎవ్వరికీ ఒక్క రూపాయి ఇవ్వకుండానే నాకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలు వస్తున్నాయి.

– బండారు రాజేశ్వరి, తణుకు

పారదర్శకంగా పథకాలు



గత ప్రభుత్వ హయాంలో మాకు ఏ లబ్ధి అందలేదు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వచ్చినప్పటి నుంచి ఎవ్వరికీ కూడా ఒక్క రూపాయి లంచం ఇవ్వకుండానే పనులు జరుగుతున్నాయి. గతంలో డబ్బులిచ్చినా పనులు అయ్యేవి కావు. జగన్ అందిస్తున్న పథకాలు అందరికీ పారదర్శకంగా ఇంటి గుమ్మంలోకే వస్తున్నాయి.

– అల్లు రమణ, తణుకు

యోగాతో మానసిక ప్రశాంతత



విజేతలను అభినందిస్తున్న యోగా గురువులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రతి ఒక్కరి జీవితానికి యోగా ఎంతో అవసరమని యోగా గురువులు ఇంజుమూరి మాధవరావు, కరిబండి రామకృష్ణ, బడుగు చంద్రశేఖర్, సుధాకర్‌లు తెలిపారు. యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఏపీ ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన ఫోర్త్ స్టేట్ యోగాసనాలలో విజేతలకు అభినందన కార్యక్రమం పట్టణంలోని పతంజలి యోగాలయంలో ఆదివారం యోగా గురువులు సమక్షంలో నిర్వహించారు. జిల్లా నుంచి పాల్గొన్న అభ్యర్థులు కార్తికే ఉషా దుర్గ ట్రెడిషనల్ యోగా, ఆర్టిస్టిక్ సోలో ఈవెంట్లో గోల్డ్ మెడల్ సాధించగా, భీమవరం నుంచి బి.ధనమాధవి సిల్వర్‌మెడల్, జి.అరుణ్‌కుమారి, టి.రవీంద్రబాబులతో పాటు ఏలూరు నుంచి ఎ.పవన్‌కుమార్‌లు బ్రౌంజ్ మెడల్స్ సాధించారు. వీరితో పాటుగా శిక్షణ ఇచ్చిన జి.సీతారామయ్యను అభినందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రంధి సత్యనారాయణ, మాకా శ్రీనివాస్‌రావు, యోగా సభ్యులు పాల్గొన్నారు.

10 మందికి ఉచిత వైద్య సేవలు

తణుకు టౌన్: పట్టణంలోని సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిషా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో సంచార వైద్యశాల ద్వారా ప్రతి ఆదివారం నిర్వహించే ఉచితవైద్య సేవల్లో భాగంగా ఆదివారం 10 మంది వృద్ధులకు ఇళ్ల వద్దకే వెళ్లి వైద్య సేవలందించినట్లు అసోసియేషన్ కార్యదర్శి కేవీ సత్యనారాయణ తెలిపారు. ప్రముఖ నేత్ర వైద్యులు డాక్టర్ హుస్సేన్ అహ్మద్ తణుకు పట్టణం, పైడిపర్రు, ముద్దాపురం గ్రామాల్లో పర్యటించి ఇంటి నుంచి నడవలేని వృద్ధుల ఇంటి వద్దకే వెళ్లి 10 మంది వృద్ధులకు వైద్య సేవలు అందించినట్లు తెలిపారు. అసోసియేషన్ సభ్యులు పరిమి సూర్యనారాయణ ఆర్థిక సహాయంతో ఉచితంగా మందులను పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో కోశాధికారి ఆర్జి భాస్కరరావు, గిరిజాల నాగేశ్వరరావు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణం

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక పాతూరులో వేంచేసియున్న పురాతన ఆలయం వల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి ఆలయం వద్ద షష్ఠి మహోత్సవం సందర్భంగా శ్రీ శోభకృత్ నామ సంవత్సరం మార్గశిర మాస శుద్ధ పంచమి ధనిష్టా నక్షత్రయుక్త కర్కాటక లగ్నమందు స్వామి, అమ్మవార్ల దివ్య కల్యాణ మహోత్సవం ఆదివారం రాత్రి 8 గంటలకు అంత్యంత వైభవంగా జరిగింది. చలంచర్ల మురళీ, జ్యోతి, హరిప్రసాద్, భాగ్యలక్ష్మి దంపతులు పీటలపై కూర్చొని ప్రత్యేక పూజలు చేశారు. జోశ్యుల శ్రీరామ చంద్రమూర్తి బ్రహ్మత్వం వహించారు. ఆలయ కమిటీ ధర్మకర్త, రైతు నాయకులు కర్రి సీతారామయ్య పర్యవేక్షించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. అదే విధంగా వాసవి కన్యకపరమేశ్వరీ ఆలయం, నందిబొమ్మ ఆలయం, గణేష్‌నగర్ ఆలయం, కడకట్ల, హౌసింగ్‌బోర్డు, పట్టణంలోని ఇతర ఆలయాల్లో స్వామివారి కల్యాణం ఘనంగా నిర్వహించారు.



పడమరవిప్పర్రు గ్రామంలో కల్యాణ మూర్తిగా సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

సుబ్రహ్మణ్యేశ్వరుని షష్ఠి వేడుకలు ప్రారంభం

పెంటపాడు: మండలంలోని సుబ్రహ్మణ్యేశ్వరుని షష్ఠి ఉత్సవాలు పలు గ్రామాలలో ఆదివారం రాత్రి నుంచి వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా పలు ఆలయాల్లో స్వామివారి కల్యాణాలు, ప్రత్యేకపూజలు, అభిషేకాలు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఏళ్ల చరిత్ర కలిగిన స్వయంభువుగా వెలసిన ప్రసిద్ధి చెందిన పడమరవిప్పర్రు వల్లీదేవసేన నాగ సమేత సంతాన సుబ్రహ్మణ్యేశ్వరుని ఆలయంలో ఆదివారం రాత్రి కల్యాణం కమనీయంగా సాగింది. పసల కుటుంబీకులు స్వామివారి కల్యాణ కార్యక్రమ తంతును కమనీయంగా నిర్వహించారు. సోమవారం స్వామివారి ప్రత్యేకపూజలకు భారీ సంఖ్యలో వచ్చే భక్తుల కోసం అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. అదే విధంగా ఉమామహేశ్వరం గ్రామంలో స్వయంభువుగా వెలిసిన పంట పొలాల్లో ఉన్న చరిత్ర ప్రాధాన్యత కలిగిన ఆలయం వద్ద రావిపాటి లక్ష్మణరావు, రత్నాజీ దంపతులు స్వామివారి కల్యాణం జరిపించారు. తొలుత గ్రామం నుంచి భక్తులతో ఊరేగింపు నిర్వహించారు. పెంటపాడు పెద్దశివాలయం వద్ద ఆలయ కమిటీ అధ్యక్షుడు కొవ్వూరి లక్ష్మణరెడ్డి ఆధ్వర్యంలో సుబ్రహ్మణ్యేశ్వరుని కల్యాణం నిర్వహించారు. దర్శిపర్రులోని పార్వతి బ్రహ్మలింగేశ్వరుని ఆలయంలో బస్వాశ్యాం దంపతుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి.

ఘనంగా క్రిస్టియన్ యూత్ సమావేశం



పాస్టర్ ఇశ్రాయేలును సన్మానిస్తున్న చింతపల్లి క్రిస్టియన్ యూత్ సభ్యులు

పెంటపాడు: చింతపల్లి జకర్యాప్రార్థనా మందిరంలో ఆదివారం ఘనంగా సంఘ క్రిస్టియన్ యూత్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ కాపరి మల్లిపూడి సాల్మన్‌రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో యువతపై ఆధ్యాత్మిక సందేశం వినిపించారు. పలువురు క్రిస్టియన్ సంఘ కాపరులను ఘనంగా సన్మానించారు. ఆర్‌సీఎం ఉపదేశి సురగాల ఇశ్రాయేలు, చదలవాడ కిరణ్, తిపర్లాళ్ల మురళి, బైపే రామకృష్ణ, గాదె కోదండం, తాతపూడి రవి తదితరులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సాల్మన్‌రాజు మాట్లాడుతూ సేవకుల సేవలు మరువలేనివన్నారు. విశ్వాసులను ఆధ్యాత్మిక మార్గంలో నడుపుతూ వారిని సరైన ఆధ్యాత్మిక మార్గంలో నడిపించడం అభినందనీయమన్నారు. చర్చిసంఘ సభ్యులు, యూత్ సంఘ సభ్యులు, స్త్రీల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులో ప్రయాణం సురక్షితం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న డీఎం యేలూరి సత్యనారాయణ మూర్తి

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితమని, ప్రయాణీకులు బస్సులను సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ డీఎం యేలూరి సత్యనారాయణ మూర్తి పేర్కొన్నారు. ఆర్టీసీ కాంప్లెక్స్‌లో జరిగిన లక్కీ డ్రా కార్యక్రమంలో ఆదివారం విజేతలకు బహుమతులు అందజేశారు. సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ జంగారెడ్డిగూడెం, ఆచంట, గణపవరం, భీమవరం రూట్లులో ప్రయాణం చేసిన ఆర్టీసీ ప్రయాణీకులు కోసం ప్రతి 15 రోజులకొకసారి ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్నట్లు, గిఫ్ట్ బాక్స్‌లో వేసిన టికెట్లు, ఫోన్ నెంబర్లు, పేర్లు ఆధారంగా లక్కీ డ్రా తీస్తున్నట్లు చెప్పారు. విజేతలు వివరాలను వెల్లడించారు. జంగారెడ్డిగూడెం ఎ.సత్తిబాబు, జె.గోపి, ఆచంట రూట్ టీఎల్ మీనాక్షి, కె.ధనలక్ష్మి, గణపవరం, భీమవరం రూట్‌లో పీఎస్ వరప్రసాద్, మహితావర్మలను ప్రకటించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది, డ్రైవర్లు, కండెక్టర్లు పాల్గొన్నారు.

ఘనంగా అపుస్మా క్రికెట్ టోర్నమెంట్



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న జంగా బాలాజీ

తాడేపల్లిగూడెం (టీఓసీ): అపుస్మా తాడేపల్లిగూడెం జోన్ క్రికెట్ పోటీలు ఆదివారం స్థానిక ఎయిర్ స్ట్రిప్ వాకర్స్ గ్రౌండ్‌లో అపుస్మా రీజనల్ చైర్మన్ జంగా బాలాజీ ఘనంగా ప్రారంభించారు. పూల్-ఎ, పూల్-బి విభాగాలుగా 18వ తేదీ సోమవారం, 19వ తేదీ మంగళవారం నిర్వహించనున్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి అత్తంటి సుబ్బరాజు మాట్లాడుతూ విద్యార్థులు క్రీడలలో రాణించాలని, మానసిక ఉల్లాసానికి, మనోధైర్యాన్ని ఆటల పోటీలు పెంచుతాయని తెలిపారు. జోనల్ అధ్యక్షుడు వాకలపూడి రామకృష్ణ, కార్యదర్శి పచ్చిపాల శివశంకర్, కోశాధికారి గుణ్ణం చిరంజీవి, గంధం సుధాకర్, ప్రభాకర్, రామ్‌రాయ్,ఎస్.శ్రీనివాస్, ప్రకాశరావు, ప్రసాద్, విజయారెడ్డి, హరిబాబులు క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు. క్రికెట్ పూల్-ఏలో సెంట్ ఆన్స్, విజ్ఞాన, ఆంగ్లో ఇండియన్, లోటస్, సన్‌షైన్, టీబీఆర్ సంస్థలు విజయం సాధించాయి.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న సబ్‌ట్రెజరీ ఆఫీసర్ దత్తేశ్వరరావు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో ఆదివారం పశ్చిమ గోదావరి జిల్లా, తాడేపల్లిగూడెం యూనిట్ ఆధ్వర్యంలో పెన్షనర్స్ డే ను విశ్రాంత ఉద్యోగులు నిర్వహించారు. బి.హరికుమార్ అధ్యక్షత వహించారు. ఫాదర్ ఆఫ్ పెన్షనర్స్ డీఎస్ నకరా సేవలను కొనియాడారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళ్లులర్పించారు. పెన్షనర్స్ సమస్యలను సమావేశంలో చర్చించారు. ప్రభుత్వం స్పందించాలని కోరారు. సబ్ ట్రెజరీ ఆఫీసర్ పి.జయదత్తేశ్వరరావు మాట్లాడుతూ పెన్షనర్స్‌కు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. 75 సంవత్సరాలు నిండిన సీనియర్ నాయకులకు సత్కారాలు చేశారు. ఈ సమావేశంలో నాయకులు వెంపరాల నారాయణ మూర్తి, గరికపాటి సుబ్రహ్మణ్య శర్మ, వీకే వీరారావు, దాసం నాగేశ్వరరావు, కె.బాలకృష్ణ, వైవీఎస్‌మూర్తి, రామ్మోహన్‌రావులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సేవా కార్యక్రమాలు అభినందనీయం

తణుకు టౌన్: జాతీయ పెన్షనర్స్ దినోత్సవం సందర్భంగా తణుకు బీఎస్ఎన్ఎల్ పెన్షనర్స్ అసోసియేషన్ చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని ఆ అసోసియేషన్ రాష్ట్ర అదనపు కార్యదర్శి పేరూరి పూర్ణాచార్యులు చెప్పారు. ఆదివారం అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పలు సేవా కార్యక్రమాల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈకార్యక్రమాలకు అసోసియేషన్ తణుకు శాఖ అధ్యక్షుడు కే మణిలాల్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ ప్రధాన కార్యదర్శి మండా అప్పలాచార్యులు, కోశాదికారి టీ సత్యనారాయణ, ఆర్గనైజింగ్ కార్యదర్శి బొడ్డు విక్టర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల సంఘ అధ్యక్షుడిగా రాజ్‌కృష్ణ



ఏకగ్రీవంగా ఎన్నికైన జిల్లా జూనియర్ కళాశాలల లెక్చరర్ సంఘ నూతన సభ్యులు

పెంటపాడు: జిల్లా జూనియర్ కళాశాలల లెక్చరర్ల సంఘ ఎన్నికలు ఆదివారం సాయంత్రం గూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలల అధ్యాపకులు పాల్గొన్న ఈ సమావేశంలో సభ్యుల నామినేషన్ అనంతరం జిల్లా అధ్యక్షునిగా ఎ. రాజ్‌కృష్ణ(తణుకు), కార్యదర్శిగా కె. అన్నవరం(పాలకొల్లు), సహాయకార్యదర్శిగా జి. శ్రీనివాస్(తణుకు), కోశాధికారిగా ఎవీఆర్ దేవరాజు(పెంటపాడు)లను ఏకగ్రీవంగా ఏనుకున్నట్లు కార్యవర్గం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఎన్నికల కోసం సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. పేర్రాజు, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి జీవీ శ్రీనివాస్, కోనసీమ అధ్యక్షుడు వై. లక్ష్మణరావులు హాజరయ్యారు. నూతన కార్యవర్గ సభ్యులను ప్రత్యేకంగా అభినందించారు.

వృద్ధురాలికి మాజీ మంత్రి రంగనాథరాజు ఆపన్న హస్తం



అయోధ్యలంకలో రూ.10వేలు ఆర్థిక సహాయాన్ని అందిస్తున్న నాయకులు

పెనుగొండ: విధి వక్రీకరించడంతో కొడుకు , కోడలు, భర్తను పొగొట్టుకొని ముదసలి వయస్సులో మనమళ్లను సాకుతున్న అవ్వకు అండగా నిలిచి ప్రతి నెలా రూ.10వేలు అందిస్తూ మాజీ మంత్రి వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు మనసున్న మారాజుగా అభినందనలు అందుకుంటున్నారు. వైఎస్సార్ సీపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు గొల్లపల్లి బాలకృష్ణ, ఇతర గ్రామస్తులు తెలిపిన వివరాలు ప్రకారం ఆచంట మండలం అయోధ్యలంక పెదపేటకు చెందిన బొంతు వెర్రమ్మ భర్త, కొడుకు, కోడలు స్వల్ప వ్యవధిలోనే మృతి చెందడంతో పూర్తిగా నిరాశ్రయులై ఆర్థిక భారంతో కుంగిపోయింది. బాధితుల వెతలు మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు దృష్టికి తీసుకు వెళ్లడంతో గత ఆగస్టు నుంచి ప్రతి నెలా రూ.10 వేలు ఆర్థిక సహాయం అందిస్తున్నారు. వెర్రమ్మకు ప్రభుత్వం అందిస్తున్న ఫించన్ రూ.2750కి తోడుగా, శ్రీరంగనాథరాజు అందిస్తున్న రూ.10వేలుతో కలిపి మనమళ్లు ప్రణీ కుమార్, లను సాకుతున్నాని వెర్రమ్మ ఆనందంగా తెలిపింది. కార్యక్రమంలో సర్పంచ్ కడలి కృష్ణవేణి, ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

డీఎన్నార్ వాకర్స్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

భీమవరం: డీఎన్నార్ వాకర్స్ అసోసియేషన్ కార్యవర్గ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యవర్గ సమావేశం లో 2024-25 సంవత్సరానికి నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా కొత్తపల్లి శివరామరాజు, అధ్యక్ష కార్యదర్శులుగా కటికల పల్లారావు, పాకలపాటి సీతారామరాజు, ట్రెజరర్‌గా కనగర్ల రామకృష్ణ ఎన్నికయ్యారు. వీరితోపాటు జాలీ వాకర్‌గా అప్పలరాజు, పీఆర్ఓగా కొప్పిసెట్టి సూర్య ప్రకాష్ ,ఉపాధ్యక్షులుగా ఎస్.త్యాగరాజు, కె.రాంబాబు, జాయింట్ సెక్రటరీలుగా కె.రామచంద్రరావు, అడపా బాబ్జీ, సభ్యులుగా పది మంది ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

శాకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

పెనుమంట్ర: ధ్యానం ద్వారా శారీరక ఆరోగ్యం, మానసిక ప్రశాంతతను జ్ఞాపకశక్తిని పెంపొందించుకోవచ్చునని పశ్చిమ గోదావరి జిల్లా పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ అధ్యక్షులు రుద్రరాజు పెద్దివర్మ అన్నారు. ఆదివారం పెనుమంట్ర పిరమిడ్ ధ్యాన శిక్షణ కేంద్రంలో ఉపసర్పంచ్ భూపతిరాజు వెంకట శ్రీనివాసరాజు అధ్యక్షతన జరిగిన మెగా మహాకరుణ- శాకాహారుల ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ శాకాహార ప్రాధాన్యతను తెలిపారు.